పేరుకుపోయిన బకాయిలు

- నెలాఖరులోపు పన్నులు చెల్లించాలి
- ఇప్పటి వరకు కేవలం 32 శాతమే వసూళ్లు

మచిలీపట్నంటౌన్: నగరపాలకసంస్థ పరిధిలో వివిధ రకాల పన్నుల బకాయిలు పేరుకుపోయాయి. ఈ నెలాఖరులోపుగా పన్ను బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు చేయాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు అన్ని పన్నులూ కలిపి కేవలం 32 శాతమే వసూలు అయ్యాయి. పన్ను వసూళ్లలో నగరపాలకసంస్థ, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. నగరంలో అన్ని పన్నులు కలిపి రూ. 23.83 కోట్ల మేర పేరుకుపోయాయి. పన్నులు వసూలైతేనే నగర ప్రజలకు ఏమైనా వసతుల కల్పనకు వీలు కలుగుతుంది. ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లించాల్సి ఉన్నా.. ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

వసూళ్లు అంతంత మాత్రమే

నగరపాలకసంస్థకు రావాల్సిన వివిధ రకాల పన్నులు రూ. 23.83 కోట్ల మేర పేరుకుపోయాయి. ఇప్పటి వరకు కేవలం 32 శాతమే వసూలు అయ్యాయి. మిగిలిన బకాయిల వసూలు ఎంఎంసీ అధికారులు, సిబ్బందికి కత్తి మీద సాములా తయారైంది. నగరంలో 52,534 పాత బకాయిలు రూ. 16.36 కోట్లు, ఈ ఏడాది బకాయిలు రూ. 7.46 కోట్లు మేర పేరుకుపోయాయి.

పన్ను బకాయిలు ఇలా..

నగరంలోని 48,944 మంది ప్రైవేటు పన్ను చెల్లింపుదారుల నుంచి పాత, ఈ ఏడాది పన్నులు రూ. 10.28 కోట్ల మేర వసూలు కావాల్సి ఉంది. దీంతో పాత బకాయిలు రూ. 5.08 కోట్లు కాగా, ప్రస్తుత బకాయి రూ. 5.19కోట్లు ఉంది. ఇప్పటి వరకు పూర్తి బకాయిలో కేవలం 47 శాతం మాత్రమే వసూలు అయ్యాయి. ఇక 271 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ. 8.66 కోట్లు పన్ను బకాయిలు రావాల్సి ఉంది. పాత బకాయి రూ. 7.62 కోట్లు, ప్రస్తుత బకాయి రూ. 1.03 కోట్లుగా ఉంది. కేవలం మూడు శాతం మాత్రమే బకాయిలు వసూలు అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధుల ఆధారంగా ఆయా సంస్థలు ఎంఎంసీకి పన్నులు చెల్లిస్తుంటాయి. ఇక 85 కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి ఎంఎంసీకి రూ. 78.63 లక్షల మేర పన్ను బకాయిలు రావాల్సి ఉంది. పాత బకాయి రూ. 66.20 లక్షలు, కొత్త బకాయిలు రూ. 12.42 లక్షలుగా ఉన్నాయి. ఈ బకాయిలు కేవలం 18 శాతం మేరకే వసూలు అయ్యాయి. అలాగే నగరంలోని 3,234 ఖాళీ స్థలాల యజమానుల నుంచి రూ. 4.09 కోట్ల పన్ను బకాయిలు వసూలు కావాలి. దీంతో పాత బకాయి రూ. 2.99 కోట్లు, ప్రస్తుత బకాయి రూ. 1.10 కోట్లుగా ఉంది. ఈ బకాయిలు కేవలం 26 శాతం మాత్రమే వసూలు అయ్యాయి.



నగరపాలకసంస్థ కార్యాలయం

తగిన చర్యలు తీసుకుంటాం



నగరపాలకసంస్థకు పన్ను బకాయిదారులు వెంటనే పన్నులు చెల్లించాలని కోరుతున్నాం. పన్నులు చెల్లించాలని ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. ఈ నోటీసులకు స్పందించకుండా ఉన్న బకాయిదారుల ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే వారి గృహాలకు ఉన్న తాగునీరు, విద్యుత్ కనెక్షన్‌లను తొలగిస్తాం.

– సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, ఎంఎంసీ కమిషనర్

క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు అండగా రెడ్‌క్రాస్



ఎదురుమొండి(నాగాయలంక): మండల పరిధిలోని ఎదురుమొండి దీవి శివారు బ్రహ్మయ్యగారి మూల గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కన్నా బసవయ్య కుటుంబాన్ని శుక్రవారం రెడ్‌క్రాస్ నాగాయలంక సబ్‌బ్రాంచ్ ప్రతినిధులు పరామర్శించి సాయం అందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శివవిష్ణు, సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో 25కిలోలు బియ్యం, కూరగాయలు, వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, హైజనిక్ కిట్‌ను మండల తహసీల్దార్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ముప్పిరిశెట్టి హరనాథ్ చేతులు మీదుగా బాధితులకు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ కన్నా నాగరాజు, కన్నా వెంకటేశ్వరరావు, మునగాల కుటుంబరావు, యర్రంశెట్టి నాగపవన్, చెన్ను వెంకటేశ్వరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు

చందర్లపాడు(నందిగామ రూరల్): మండలంలోని కోనాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాగర్ మల్టీస్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మార్కపూడి వెంకట్రావమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో 110 మందికి వైద్యులు లక్ష్మీప్రియ, పవన్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మార్కపూడి జాన్‌కోటయ్య, కొత్తా కామేశ్వరరావు, ఉలవలపూడి నతానియేలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కమలమ్మకు నివాళి



అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్ మాతృమూర్తి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నలుకుర్తి కమలమ్మకు మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించారు. స్థానిక 8వ వార్డులో శుక్రవారం కమలమ్మ పెదకర్మ జరిగింది. ఈ సందర్భంగా కమలమ్మ చిత్రపటానికి నందిగం, సింహాద్రి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులపై ఫిర్యాదు

అవనిగడ్డ: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలు, దిష్టిబొమ్మను దగ్ధం చేసిన టీడీపీ, జనసేన నాయకులపై యువ న్యాయవాది బడే గౌతమ్ శుక్రవారం అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ గురువారం అవనిగడ్డ వంతెన సెంటర్‌లో మాజీ సీఎం జగన్ చిత్రపటాలు, దిష్టిబొమ్మను జనసేన, టీడీపీ నాయకులు దగ్ధం చేశారని తెలిపారు. దీంతోపాటు జగన్, వైఎస్సార్ సీపీపై అనుచిత వ్యాఖ్యలు చేసి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్‌ని కోరారు.

వైభవంగా శ్రీ భావనారుషి స్వామి గ్రామోత్సవం

ఘంటసాల: ఘంటసాల గోటకం కాలనీలో శ్రీ భద్రావతిదేవి శ్రీ భావనారుషిస్వామి వార్ల గ్రామోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామివార్లకు కల్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. కమిటీ సభ్యులు తుమ్మలచర్ల మురళీకృష్ణ, ఆకురాతి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాగేంద్ర, పవన్, నందం పాండురంగారావు, భక్తులు పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్ బాలాజీ

దక్షిణ చిరువోలులంక(అవనిగడ్డ): మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో జరుగుతున్న రీ సర్వేను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం పర్యవేక్షించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించిన ఆయన అక్కడున్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ నిజ నిర్ధారణ, భూ ధృవీకరణ ప్రక్రియలు సక్రమంగా జరిగితే రీ సర్వేలో మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. రీ సర్వే గురించి ప్రతి రైతుకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వ భూములు ఎక్కడున్నా చేతులు మారితే వాటిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, భూ రికార్డుల సర్వే ఏడీ ఎం జోషిలా, తహసీల్దార్, సర్వేయర్లు పాల్గొన్నారు.



రీ సర్వే గురించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పీ–4 సర్వేను వేగవంతం చేయండి

పెడన: పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్‌కు సంబంధించిన పీ–4 సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం గోపాలరావు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని వీసీ చాంబరులో పీ–4 సర్వేకు సంబంధించి మాస్టర్ ట్రైనర్ పూర్ణ, మణికంఠ వార్డు సచివాలయ ఉద్యోగులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీలోగా ఈ సర్వే పూర్తి చేయాలని సూచించారు. కాబట్టి సిబ్బంది త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేయడానికి సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరరావు లేదా మాస్టర్ ట్రైనీలు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగాయలంక: పి–4 సర్వేను శనివారం నుంచి ఈ నెల18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా సర్వే జరుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి...

కోడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పీ–4 సర్వేను మండలంలో శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ వివరాలు, సామాజిక ఆర్థిక స్థితిగతులకు సంబంధించి మొత్తం 27 ప్రశ్నల ద్వారా డేటాను సిబ్బంది సేకరిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 21న అన్ని సచివాలయాల్లో సర్వే సమాచారాన్ని జాబితా రూపంలో పొందుపర్చనున్నట్లు వివరించారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

ఘంటసాల: మండల పరిషత్ కార్యాలయంలో పీ–4 సర్వేపై సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ సర్వేలో ఖచ్చితమైన డేటా సేకరించాలని సూచించారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, ఏఓ కె.మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుగుణకుమారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగులు

మహిళలకు ఆటల పోటీలు

పెడన: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని చెన్నూరు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు నేడు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణించడమే కాకుండా ముందంజలో ఉంటున్నారని పేర్కొన్నారు. అనంతరం మహిళలకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ వాక్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్ గీత, కే పార్వతీ, బీ కుమారి, కేవీ సుజాత, కే విజయలక్ష్మి, రజని తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన మహిళలతో అంగన్‌వాడీ టీచర్లు

35 లీటర్ల నాటుసారా స్వాధీనం

కోనేరుసెంటర్: బందరు మండలం కేపీటీ పాలెంలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొపనాతి రామకృష్ణ, ఒడుగు పున్నయ్యలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 35 లీటర్ల నాటుసారాను, రవాణాకు ఉపయోగిస్తున్న ఫైబర్ బోటును స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేశారు.

స్కౌట్స్ విద్యార్థినులకు యూనిఫాం అందజేత

పెడన: పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థినులు 15 మందికి పాఠశాల పూర్వ విద్యార్థి, ఇంటర్మీడియట్ విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి శుక్రవారం యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అద్దంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాధాకృష్ణమూర్తి రూ.10వేలు విలువైన యూనిఫాంలను విద్యార్థినులకు అందజేయడం అభినందనీయమన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థినులు సేవాభావంతో దేశ పురోగాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, స్కౌట్స్ అండ్ గైడ్ కెప్టెన్లు సుమయకాతూన్, ఏఎస్‌వీ కుమారి, ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



యూనిఫాం అందుకున్న విద్యార్థినులతో రాధాకృష్ణమూర్తి, అశోక్‌కుమార్ తదితరులు

నవలంకలో ప్రార్థనలు

నాగాయలంక: ప్రపంచ ప్రార్థన దినోత్సవం పురస్కరించుకుని స్థానిక రక్షణ సైన్యం (సాల్వేషన్ ఆర్మీ) ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్ ఎదుట కృష్ణానది మధ్యలో గల నవలంక ఐలెండ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచ శాంతి, న్యాయం కోసం మార్చి మొదటి శుక్రవారం క్రైస్తవ మహిళలు ఒక సాధారణ ప్రార్థన దినోత్సవం జరుపుతారని నాగాయలంక రక్షణ సైన్యం మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీన రత్నకుమారి వివరించారు. తొలుత గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధికారి(డీఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, కెప్టెన్ జీ కెజియా, లెఫ్టినెంట్ వరకుమారి, ఉష, వకీలదేవి, హెల్పర్ వై దేవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.




ప్రార్థన దినోత్సవంలో రక్షణ సైన్యం మహిళా ప్రతినిధులు

లోన్ క్లియరెన్స్ అందజేసి నష్టపరిహారం చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి సర్టిఫైడ్ కాపీలతోపాటు ఆస్తిపై ఎటువంటి బాకీ లేదని, నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయలు శుక్రవారం తీర్పు చెప్పారు. విజయవాడకు చెందిన ఆర్‌వీ సత్యనారాయణమూర్తి అప్పటి ఆంధ్రాబ్యాంకు విజయవాడ మెయిన్ బ్రాంచ్‌లో 2010వ సంవత్సరంలో రూ. 20 లక్షలు రుణంగా తీసుకున్నారు. లోన్ నిమిత్తం ఆయన భార్య నరసమాంబ ఆస్తి పత్రాలను గ్యారెంటర్‌గా బ్యాంకులో డిపాజిట్ చేశారు. 2018లో వడ్డీతో సహా లోన్ క్లియర్ చేశారు. అయితే లోన్ మొత్తం కట్టినా కూడా ఆస్తి పత్రాలు బ్యాంకు వారు తిరిగి ఇవ్వకుండా కనిపించడం లేదని సర్టిఫైడ్ కాపీలను ఇస్తామని చెప్పారు. ఒరిజనల్ పత్రాల కోసం బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో సత్యనారాయణమూర్తి వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు విచారణ అనంతరం ఆస్తిపత్రాల సర్టిఫైడ్ కాపీలతోపాటు ఆ ఆస్తిపై ఎటువంటి బాకీ లేదని సర్టిఫికెట్, ఫిర్యాదుదారునికి డాక్యుమెంట్లు ఇవ్వాలని, ఫైనాన్షియల్ డ్యామేజ్ కింద ఆస్తిపత్రాలకు రూ. 5 లక్షలు నష్టపరిహారం, మానసిక వేదన కలిగించినందుకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు 30 రోజుల్లోగా ఇవ్వాలని తీర్పు వెల్లడించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని మచిలీపట్నం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలకు, సహాయకులకు పలు రకాల ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి కృష్ణాజిల్లా ఐసీడీఎస్ పీడీ రాణి, మచిలీపట్నం సీడీపీఓ గ్లోరీ, ఏసీ డీపీఓ పద్మావతి, ఎన్జీవో గోవాడ ప్రశాంతి తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మహిళలు నైతిక విలువలతో బాధ్యతగా మెలగాలన్నారు. డాక్టర్ అనంత్‌కుమార్, ఐసీడీఎస్ మచిలీపట్నం ప్రాజెక్టు సూపర్‌వైజర్‌లు, ప్రాజెక్టు లీడర్‌లు, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

- స్థానిక నోబుల్ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక లేడీయాంప్టిల్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి హాజరయ్యారు. ఫిబ్రవరి 9న కళాశాలలో వంటల విక్రయాల ద్వారా వచ్చిన మొత్తాన్ని 10 మంది విద్యార్థినులకు సాయంగా అందజేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నెస్ట్, పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రభ, నోబుల్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరంలో...

గూడూరు: మండలంలోని పోలవరం గ్రామంలో ఏఈఔ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్నేహిత కలంకారి యూనిట్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలంకారి వస్త్రాలు, ట్రెడిషన్ డ్రస్‌లతో కల్చరల్ యాక్టివిటీస్ థీమ్‌తో ముందుకు సాగుదాం అని మహిళలు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. వేగవంతమైన చర్య అనే నినాదంతో మహిళల ఎదుగుదల, నైపుణ్యాభివృద్ధి, స్వేచ్ఛ, మహిళా సాధికారత మొదలగు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కలంకారి ఆర్టిసన్స్, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ రోడ్ల సౌకర్యం కల్పించాలంటూ వినతి

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రహదారుల సౌకర్యం కల్పించాలంటూ ఆ గ్రామ సర్పంచ్ కోసూరు అనూష జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే మండల కేంద్రం మోపిదేవిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు జిల్లా కలెక్టర్ బాలాజీని కోరారు.

■ పరస్పర కేసులు నమోదు

కోనేరుసెంటర్: మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, బార్ అండ్ రెస్టారెంట్ యజమాని ఇచ్చిన ఫిర్యాదులపై ఇనగుదురుపేట పోలీసులు శుక్రవారం పరస్పర కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని నాగపోతురాజు సెంటర్ నుంచి చింతచెట్టు సెంటర్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఎంఎంసీ అధికారులు తొలగింపు పనులను చేపట్టారు. ఈ ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో వాసవి బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించిన బోర్డును మున్సిపల్ సిబ్బంది తొలగించడంతో బార్ యజమాని, జనసేన పార్టీ నాయకుడు కొరియర్ శ్రీను ఎంఎంసీ జేసీబీ మిషన్లను తన అనుచరుల చేత బలవంతంగా లాక్కుని వెళ్లాడు. దీంతో ఆక్రమణల తొలగింపు పనులను అడ్డుకోవడంతో పాటు మున్సిపల్ అధికారుల విధులకు ఆటంకం కలిగించాడంటూ శ్రీనుపై టౌన్ ప్లానింగ్ అధికారి ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరోవైపు తన ఆస్తికి నష్టం కలిగించారని శీను మున్సిపల్ అధికారులపై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఇరువురి ఫిర్యాదులపై పరస్పర కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

■ కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆక్రమణ తొలగింపు పనులు శుక్రవారం కూడా కొనసాగాయి. నగరంలోని నాగపోతరావుసెంటర్ ప్రాంతంలో ఆక్రమణలు, డ్రెయిన్‌పై ఉన్న కట్టడాలను నగరపాలకసంస్థ సిబ్బంది తొలగించారు. అయితే ఆ ప్రాంతంలో జనసేన నాయకుడు కొరియర్ శ్రీనుకు సంబంధించిన బార్ బోర్డును సిబ్బంది తొలగించే ప్రయత్నం చేయగా అధికారులతో ఆయన వాగ్వాదానికి దిగాడు.

■ విద్యుత్ తనిఖీలు

చల్లపల్లి: ఉయ్యూరు డివిజన్ పరిధిలోని చల్లపల్లి మండలం లక్ష్మీపురం సబ్‌డివిజన్‌లో శుక్రవారం విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అదనపు లోడు కనెక్షన్లను గుర్తించి రూ.7.74లక్షలు జరిమానా విధించినట్లు ఉయ్యూరు ఈఈ డి.కృష్ణ నాయక్ తెలిపారు. చల్లపల్లి, అవనిగడ్డ, ఉయ్యూరు, డీవైఈఈలు పి.శివనాగేశ్వరరావు, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, జి.హేమకుమార్, డీపీఈ జి.లక్ష్మీనారాయణ, డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్ల ఏఈలు, జేఈలు, ఎల్ఐలు పాల్గొన్నారు.

■ రిపబ్లిక్ డే వేడుకలకు ఎన్‌సీసీ క్యాడెట్లు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలకి చెందిన ఎన్‌సీసీ విద్యార్థి ఎం. బాబే అభిషేక్ 2026 జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించే ఆర్‌డీసీ కర్తవ్య పథ్ (రిపబ్లిక్ డే క్యాంప్) పరేడ్‌కు ఎంపికయ్యారు. అలాగే మరో విద్యార్థి ఎం. వివేక్ భారత సైనిక అకాడమీ (ఐఎంఏ) మిలిటరీ అటాచ్‌మెంట్‌కు ఎంపికయ్యారు. శుక్రవారం విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ విజయకుమారి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ రామశేఖరరెడ్డి బాబే అభిషేక్, వివేక్‌లను అభినందించారు.

■ రామ్మోహనరావు మృతికి సంతాపం

గూడూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై శుక్రవారం చిట్టిగూడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకుమర్రుకు చెందిన ఆటో వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు బొల్లా రామ్మోహనరావు మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆకుమర్రులో రామ్మోహనరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. అలాగే మండలంలోని వివిధ పార్టీల నాయకులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నివాళులర్పించారు.

నాగాయలంక గ్రామ పంచాయతీ పరిశీలన

నాగాయలంక: కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ స్టాండరైజేషన్ (ఐఎస్ఒ) సంస్థ కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ పి.బేతు బాలకృష్ణ బృందం శుక్రవారం నాగాయలంక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలను అడిగి తెలుసుకుని రికార్డులను, నిర్వహణ పరిశీలించారు. ప్రజలకు సేవలు అందించడంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తున్న అంశాలపై ఆరా తీశారు. గ్రామ సర్పంచ్ కై తేపల్లి అంకాలు, పంచాయతీ కార్యదర్శి జే పవన్‌కుమార్, ఈఓపీఆర్డీ కే అప్పల నరసమ్మ, టీమ్ సభ్యులు శ్రీరిష, సోనియా పాల్గొన్నారు.

10 నుంచి నర్సాపురం బస్సు పునరుద్ధరణ

అవనిగడ్డ: నాగాయలంక నుంచి నర్సాపురం మధ్య ఆర్టీసీ బస్ సర్వీసను ఈనెల 10వ తేదీ నుంచి పునరుద్ధరించనున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కొంతకాలం నడిపిన ఈ సర్వీస్ ఆదాయం బాగా పడిపోవడంతో నిలిపివేశామని చెప్పారు. అయితే ఈ ప్రాంత ప్రజానీకం కోరిక మేరకు మళ్లీ పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వీసును ఆదరించాలని ప్రయాణికులను కోరారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd. ... [illegible] ... Ack Due ... [illegible] ... 58-00 ... 41-00 ... 58-00 ...

రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ, సెల్. 98484 12630

తేది.07-3-2025